రమణీయం..బ్రహ్మంగారి రథోత్సవం

● భారీగా తరలివచ్చిన భక్తులు



పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



భక్తుల మధ్య సాగుతున్న రథోత్సవం

పత్తికొండటౌన్: శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి రథోత్సవం శనివారం వేలాది మంది భక్తుల మధ్య రమణీయంగా సాగింది. ముందుగా స్వామివారి రథాన్ని పూలతో అలంకరించి, ఉత్సవ విగ్రహాలను కొలువుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తులతో తేరుబజారు కిక్కిరిసిపోయింది. పెద్ద ఆంజనేయస్వామి ఆలయం నుంచి తేరు బజారు, పెద్దమసీదు, చక్రాళ్లరోడ్డు వరకు పెద్ద ఎత్తున ప్రజలు భవనాలు ఎక్కి రథోత్సవాన్ని తిలకించారు. పట్టణ ప్రజలే కాకుండా మండలంలోని గ్రామాల ప్రజలు రథోత్సవానికి అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తన ఇంటి నుంచి ప్రధానరోడ్డు వెంట తేరుబజారు వరకు పార్టీ శ్రేణులతో కలసి ప్రజలకు అభివాదం చేస్తూ భారీ ర్యాలీగా వచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి రథానికి కొబ్బరికాయ కొట్టి పూజలుచేసి, రథోత్సవాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు రథోత్సవంలో జూనియర్ సివిల్‌జడ్జి దివ్య, తహసీల్దార్ విష్ణుప్రసాద్, ఎంపీపీ నారాయణదాసు, పత్తికొండ సర్పంచ్ కొమ్ము దీపిక, మార్కెట్‌కమిటీ చైర్మన్ పక్కీరప్ప, పార్టీ నాయకులు శ్రీరంగడు సోమశేఖర్, బాబురెడ్డి, సీలకంఠ, కొమ్ము నెట్టేకల్లు, సర్పంచులు రహిమాన్, శ్రీరాములు, అంజినయ్య, కేశవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు ఎల్లారెడ్డి, తుప్పటి నాగన్న, మారినేని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. పత్తికొండ సీఐలు మురళీమోహన్, రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆయా సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు గోపాల్, భూపాలుడు, రామ్‌మోహన్‌రెడ్డి, పోలీసుసిబ్బంది, స్పెషల్‌పార్టీ పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. అలాగే హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ పత్తికొండ రథోత్సవంలో పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రేశ్వరస్వామి రథోత్సవం

హొళగుంద: మండల పరిధిలోని వందవాగిలి గ్రామంలో శనివారం సాయంత్రం వీరభద్రేశ్వరస్వామి (రామలింగేశ్వరస్వామి) రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం మహా రుద్రాభిషేకం నిర్వహించిన గ్రామస్తులు వీరభద్రేశ్వరస్వామి వీరఘాసీ వచనాలతో నందికోలు ఊరేగింపుల మధ్య కుంభోత్సవాన్ని చేపట్టారు. రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణంతో పాటు ఇతర ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను రథంలో ఉంచి అశేష భక్త జనుల మధ్య రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హొళగుంద ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ప్రత్యేక పూజలో వీరభద్రేశ్వరస్వామి

ఆ మధుర స్మృతుల్లో..

● ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువును సన్మానిస్తున్న జడ్జి గంగారావు, పూర్వ విద్యార్థులు

తుగ్గలి: వారంతా పూర్వ విద్యార్థులు.. పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ పాఠశాలలో చదివిన వీరు ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. అందులో హైకోర్టు జడ్జి ఎం గంగారావు ఒకరు. శనివారం పూర్వ విద్యార్థి జడ్జి బాల్య మిత్రుడు పెండేకల్లు భాస్కరరెడ్డి అధ్యక్షతన అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు యోగ క్షేమాలు తెలుసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ గురువు సుంకిరెడ్డి తనయుడు డాక్టర్ రాజశేఖరరెడ్డి రూ.25 వేలు, ఐసీఆర్ రిటైర్డ్ డైరెక్టర్ మురళీధరరావు రూ.10 వేల చెక్కులను అందజేశారు. పూర్వ గురువులు సుంకిరెడ్డి, తిప్పన్న, హుసేన్ పాఠశాల, విద్యార్థులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పాఠశాలపై తమ కెంతో ప్రేమ అని పూర్వ విద్యార్థులు జడ్జి గంగారావు అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్వాతంత్ర్య సమర యోధురాలు రెడ్డి లక్ష్మమ్మ జ్ఞాపకార్థం కేపీఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్ట్ అందించిన పరీక్ష ప్యాడ్, జామెట్రీ బాక్సులను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం జడ్జిని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ హారికరెడ్డి, పూర్వ విద్యార్థులు శంకరరెడ్డి, శ్రీరాములుగౌడ్, నాగభూషణరెడ్డి, సుధాకరరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెన్నకేశవుడి సన్నిధిలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఆలూరు: దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామ ఫారెస్ట్‌లో వెలసిన కొలుట్ల చెన్నకేశవ స్వామిని శనివారం ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతరెడ్డి, దేవస్థానం సిబ్బంది, అర్చకులు ఎమ్మెల్సీకి స్వాగతం పలికి తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

రాజీ మార్గమే ఉత్తమ పరిష్కారం

ఎమ్మిగనూరు: కేసుల పరిష్కారంలో రాజీమార్గమే ఉత్తమమైనదని ఎమ్మిగనూరు మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ గురు అరవింద్ అన్నారు. శనివారం ఎమ్మిగనూరు కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ క్షణికావేశంలోనూ, వివక్ష కోల్పోయి జరిగిన సంఘటనల్లోనూ కక్షిదారులు పునరాలోచించి రాజీ పడటం మంచి పరిణామం అన్నారు. కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాల సమస్యలు కూడా సాధ్యమైనంత వరకు కాలయాపన చేసుకోకుండా పరిష్కరించుకోవాలన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 1,576 కేసులు పరిష్కారమయ్యాయన్నారు.

14న బండలాగుడు పోటీలు

మద్దికెర: మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో తిమ్మప్పస్వామి రథోత్సవం పురస్కరించుకుని ఈనెల 14న దేశం ఎద్దులు, కిలారి ఎద్దులు రాష్ట్రస్థాయి బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. మొదటి 11స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. పోటీలలో పాల్గొనదలచిన ఎడ్ల యజమానులు 7981580736, 8247886829 సంప్రదించి ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

బైకిస్టుకు గాయాలు

వెల్దుర్తి: హైవే -44పై డోన్ వైపు రైల్వేగేట్ అవతల ఉన్న టీ క్లబ్ సర్కిల్‌లో జీపు ఢీకొని వెల్దుర్తికి చెందిన బైకిస్టు జమ్మన్న గాయాలపాలయ్యాడు. పట్టణంలో నుంచి బైక్‌పై వెళ్తూ హైవే క్రాస్ దాటుతున్న జమ్మన్నను డోన్ వైపు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న జీపు ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన జమ్మన్నను అదే జీపులో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

దీన్ దయాల్ ఉపాధ్యాయకు ఘన నివాళి



దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు రూరల్: స్థానిక బీజేపీ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం దీన్‌దయాల్ ఉపాధ్యాయ వర్ధంతిని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెఆర్ మురహరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. దీన్‌దయాల్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ సేవలను కొనియాడారు.

దోమల నివారణకు ఫాగింగ్

హొళగుంద: మండల పరిధిలోని మార్లమడికి, ముద్దటమాగి గ్రామ వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. కొంతకాలంగా దోమల బెడద తీవ్రం కావడంతో ఫాగింగ్ చేపట్టామని సర్పంచ్ యంకప్ప తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రతి రోజూ రాత్రి వీధుల్లో ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గ్రామస్తులు చెత్తచెదారం ఎక్కడంటే ఎక్కడ పడేయవద్దని కోరారు.

వైద్యం దైవాధీనం

● హొళగుంద పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లు నియామకం
● ఒకరు విధుల్లో చేరనేలేదు.. మరొకరు అనధికారిక గైర్హాజరు
● సకాలంలో రోగులకు అందని వైద్యసేవలు



హొళగుంద పీహెచ్‌సీ

హొళగుంద: మండల ప్రజలకు వైద్యం దీవాధీనంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వస్తే ప్రాణాలు నిలుస్తాయన్న నమ్మకం లేకుండా పోయింది. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నా.. కొందరు డాక్టర్ల వల్ల లక్ష్యం నీరుగారుతోంది. ఇక్కడ నియమించిన ఇద్దరు డాక్టర్లు తమ విధుల పట్ల బాధ్యతారాహిత్యంతో ఉండటంతో పలువురు రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం అత్యవసర వైద్యం నిమిత్తం వచ్చిన ఓ మహిళకు స్టాఫ్ నర్సులే దిక్కుగా మారి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం ఆదోనికి రెఫర్ చేయగా మార్గమధ్యలోనే ఆమె ప్రాణాలొదిలింది. ఇద్దరు డాక్టర్లలో ఒక్కరైనా విధుల్లో ఉండి ఉంటే మెరుగైన వైద్యం అంది మహిళ ప్రాణాలతో ఉండేదేమోనని బాధితురాలి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

విధుల్లో చేరని డాక్టర్.. అనధికార సెలవుపై మరో డాక్టర్

పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండేవారు. అందులో ఇటీవల డాక్టర్ రాధను ఉన్నతాధికారులు గజ్జహళ్లి పీహెచ్‌సీకి బదిలీ చేశారు. ఆమె స్థానంలో గజ్జహళ్లి పీహెచ్‌సీ డాక్టరు న్యూటన్‌ను హొళగుందకు బదిలీ చేశారు. అయితే ఆయన ఇప్పటి వరకు ఇక్కడ విధుల్లో చేరకుండా సెలవుల్లో ఉన్నారు. కాగా మరో డాక్టరు వెంకటసుబ్బయ్య. ఈయన దాదాపు రెండు నెలలుగా పీహెచ్‌సీ గడప తొక్కలేదు. అలాగని సెలవు కూడా పెట్టలేదు. ఈయన విషయమై ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతిని వివరణ కోరగా ఆస్పత్రికి న్యూటన్, వెంకటసుబ్బయ్య అనే ఇద్దరు డాక్టర్లను నియమించామన్నారు. డాక్టర్ న్యూటన్ విధుల్లో చేరకుండా సెలవులో ఉండగా వెంకటసుబ్బయ్య విధులకు సక్రమంగా హాజరు కావడం లేదన్నారు. పలుమార్లు మెమోలు ఇచ్చినా అతనిలో మార్పు లేదన్నారు. డాక్టర్ వెంకటసుబ్బయ్య విషయాన్ని డీఎంహెచ్‌ఓ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు.

అట్టహాసంగా ఎడ్ల బండ లాగుడు పోటీలు



బండ లాగుతున్న ఎద్దు

ఆలూరు: దేవనకొండ మండలం కొత్తపేట గ్రామంలో హజరత్ దివాన్ మస్తాన్‌వలి స్వామి ఉరుసు సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, కొత్తపేట గ్రామ సర్పంచ్ షేకమ్మ పాల్గొన్నారు.

1,033 కేసుల పరిష్కారం

పత్తికొండటౌన్: రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం పత్తికొండ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జడ్జి వి.దివ్య 1,033 కేసులను పరిష్కరించినట్లు లోక్‌అదాలత్ క్లర్క్ రమాదేవి తెలిపారు. ఎస్‌టీసీ, సీసీ కేసులు 995, క్రిమినల్ కేసులు 22, సివిల్ 10, ఎంసీ-1, డీవీసీ-1, ఐపీసీ 379 కేసులు-4 ఉన్నట్లు లోక్‌అదాలత్ క్లర్క్ తెలిపారు.

శివస్వాముల అన్నదానం

కృష్ణగిరి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివ మాల ధరించిన పెనుమాడ శివస్వాములు శనివారం గ్రామస్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. ప్రతేడాది గ్రామానికి శుభం కలగాలని శివభక్తులందరం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు శివస్వాములుమాధవకృష్ణ, ఇంద్రప్రసాద్ తెలిపారు. తీర్థ ప్రసాదాలను గ్రామస్తులతోపాటు గ్రామం మీద వెళ్లే వాహదారులందరికీ అందజేశారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విన్నర్స్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు నీలకంఠ

పత్తికొండటౌన్: రథోత్సవం సందర్భంగా పత్తికొండ పట్టణంలో నిర్వహించిన అండర్-19 క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. విన్నర్స్ జట్టుకు రూ.10,016 నగదు, ట్రోఫీని వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యుడు జంగం నీలకంఠ, రన్నర్స్ జట్టుకు రూ.4,016 నగదు, ట్రోఫీని రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, మూడవ బహుమతి రూ.2,016 నగదు, ట్రోఫీని వార్డుసభ్యుడు టైలర్ రంగన్న అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రాజేశ్, పీఈటీలు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

పత్తికొండ రూరల్: పత్తికొండ-చక్రాళ్ల రోడ్డులోని పంప్‌హౌస్ వద్ద శనివారం అక్రమంగా తరలిస్తున్న రూ.6లక్షలు విలువైన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా గుర్తించిన ట్రాలీ బొలేరో, కారును ఎస్‌ఐ గోపాల్, సిబ్బందితో కలిసి వెంబడించి పట్టుకున్నామన్నారు. తనిఖీ చేయగా అందులో 100 కేసులు కర్ణాటక మద్యం పట్టుబడినట్లు చెప్పారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న తుగ్గలి మండలం ఎద్దులదొడ్డికి చెందిన అనుమేష్, రామాంజి, మోహన్ క్రిష్ణ, రాములను అరెస్టు చేసి, వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఎమ్మిగనూరు టౌన్: మానవత నైతిక విలువలు అన్న నినాదంలో ఈనెల 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న జాగృతి కార్యక్రమ పోస్టర్లను జమాతే ఇస్లాం హింద్ జిల్లా అధ్యక్షులు హబీబ్ శనివారం ఆవిష్కరించారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ట



ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

వెల్దుర్తి: బొమ్మిరెడ్డిపల్లెలో శనివారం ఆంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టను పండితులు ఉలిందకొండ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గ్రామానికి చేరుకుని స్వామివారికి, ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడులతో శ్రీగిరికి

వెల్దుర్తి: మండలంలోని 40 మంది శివమాలధారణ భక్తులు శనివారం ఇరుముడులతో వాహనాల్లో శ్రీశైలం తరలివెళ్లారు. సిద్ధేశ్వరస్వామి ఆలయంలో గురుస్వాముల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దీక్షా పరులు ఇరుముడులు స్వీకరించారు. దీక్షాపరులు కుటుంబీకులు, భక్తులు విశేషంగా హాజరయ్యారు. శ్రీగిరి మల్లికార్జున స్వామికి ఇరుముడి సమర్పించి తిరిగి వచ్చి శివరాత్రి నాడు స్థానిక శైవ క్షేత్రం బ్రహ్మగుండంలో తమ దీక్ష విరమించనున్నట్లు శివస్వాములు తెలిపారు.

తిమ్మప్పస్వామి ఉత్సవాలు ప్రారంభం

మద్దికెర: ఎడవలిలో తిమ్మప్ప, దడేదూలప్ప, ఎడవళ్లప్ప స్వాముల ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ముందుగా స్వామివారికి గంగపూజ చేయడానికి గ్రామ పురవీధుల గుండా డప్పువాయిద్యాలతో జలాన్ని తెచ్చారు. గంగ పూజ నిర్వహించిన అనంతరం తిమ్మప్ప స్వామి వారి మూలవిరాట్, యడివళ్లప్ప తిమ్మప్ప, దడేదూళప్ప స్వామి వార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

14 నుంచి అల్లిసాహెబ్ ఉత్సవాలు



అల్లి సాహెబ్ స్వామి దర్గా

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్ కైరవాడి గ్రామంలో 14వ తేదీ నుంచి అల్లిసాహెబ్ స్వామి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 14న స్వామివారి గంధం, 15న ఉరుసు, 16న కిస్తీ కార్యక్రమాలు ఉంటాయి. అల్లిసాహెబ్ ఉరుసును కులమతాలకు అతీతంగా జరుపుకుంటారు. స్వామి వారికి భక్తులు ఇసుకను నైవేద్యంగా సమర్పిస్తారు. గ్రామ సమీపంలో ఉన్న హంద్రీలోని ఇసుకను ఎద్దుల బండితో తీసుకువచ్చి స్వామి వారికి సమర్పించి తమ సమస్యలు విన్నవిస్తారు. వచ్చే ఏడాదిలో అవి పరిష్కారమవుతాయిన గ్రామస్తుల నమ్మకం. దీంతో గ్రామంలోని భక్తులతో పాటు ఇతర గ్రామాల భక్తులు ఎద్దుల బండ్ల ద్వారా ఇసుకను స్వామి వారికి సమర్పిస్తారు. చల్లని ఇసుకను సమర్పిస్తే స్వామి చల్లగా తమ కోర్కెలు తీరుస్తాడని నమ్మకం. ఇది ఎన్నో ఏళ్లుగా వస్తున్న ఆచారమని గ్రామస్తులు చెబుతున్నారు. అలాగే దర్గా ప్రాంగణంలోనే ఎల్లమాంబదేవి ఆలయం ఉంది. ప్రతి రోజు భక్తులు దర్గాతో పాటు ఎల్లమాంబ ఆలయంలోనూ పూజలు చేస్తారు. దర్గా, ఆలయం పక్కపక్కనే ఉన్నప్పటికీ ఎటువంటు భేదాభిప్రాయలు లేకుండా రెండు వర్గాల వారు ప్రార్థనలు, పూజలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

20 నుంచి హిమాంకాశీం స్వామి ఉరుసు

కృష్ణగిరి: మండల పరిధిలోని పోతుగల్లు గ్రామంలో వెలసిన భక్తుల ఆరాధ్య దైవం హిమాంకాశీం స్వామి ఉరుసును ఈ నెల 20 నుంచి మూడు రోజులు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 20న గంధం, 21న ఉరుసు, 22న కిస్తీ వేడుకలతో ఉరుసు ఉత్సవాలు ముగిస్తాయని వారు తెలిపారు.



దర్గాను రంగులతో అలంకరిస్తున్న దృశ్యం